జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 24 1-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను
తొలివెలుగు
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## ఇ-సైకిళ్లపై భారీ రాయితీ..

- గిన్నిస్ రికార్డుతో ఏపీ సర్కార్ కొత్త చరిత్ర
- ఏపీలో ఇ-సైకిళ్లపై రూ.10 వేల రాయితీ ప్రకటించిన ప్రభుత్వం
- 24 గంటల్లో 5,555 సైకిళ్లు పంపిణీ చేసి గిన్నిస్ రికార్డు
- కుప్పంలో 3 కిలోమీటర్లు ఇ-సైకిల్ నడిపిన సీఎం



2లో



2లో

## వృద్ధి మంత్రం పొదుపు సూత్రం

- కేంద్ర బడ్జెట్ 202627
- నేడు బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నిర్మలా సీతారామన్
- వృద్ధిక్రమ-శిక్షణ మధ్య సమతుల్యత
- రక్షణ, రహదారులు, రైల్వేలు, గృహ నిర్మాణంపై ఫోకస్.
- ద్రవ్యలోటు 4.4 శాతం లక్ష్యం

## నోటీసులపై కేసీఆర్ ఘాటు లేఖ

- పోలీసు చర్యలపై రాజ్యాంగ ప్రశ్నలు
- నోటీసు అంటింపు రాజ్యాంగ విరుద్ధమని కేసీఆర్ ఆరోపణ
- 65 ఏళ్లు దాటినవారికి నివాసంలోనే విచారణ నిబంధన ఉల్లంఘన
- జూబ్లీహిల్స్ ఏసీపీకి అధికార పరిధి లేదన్న స్పష్టీకరణ
- హరీశ్ రావు విషయంలో రెండు నాల్కల ధోరణి అంటూ విమర్శ
- సుప్రీంకోర్టు మార్గదర్శకాల ఉల్లంఘనపై తీవ్ర ఆగ్రహం
- బాధ్యతాయుత పౌరుడిగా విచారణకు సిద్ధమన్న కేసీఆర్



2లో

## ప్రతి వార్డు విజయం

# కాంగ్రెస్‌కు కీలకం

**సామాజిక సమతుల్యత, గెలుపు సామర్థ్యం, పార్టీ విధేయత ఆధారంగా టికెట్లు.**

- మున్సిపల్ ఎన్నికలకు అత్యున్నత ప్రాధాన్యం
- బీజేపీ, బీఆర్ఎస్‌లకు సమర్థంగా ప్రతిఘటించే కార్యాచరణ.
- బలహీన మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి
- క్షేత్రస్థాయి ప్రచారమే కేంద్రబిందువు
- రెబెల్ సమస్యలకు రాజకీయ పరిష్కారం

మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రాధాన్యంతో కూడిన జూమ్ సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశం కేవలం సమీక్షా సమావేశంగా కాకుండా, రాబోయే పురపాలక ఎన్నికలకు పార్టీ వ్యూహాన్ని ఖరారు చేసే కీలక రాజకీయ వేదికగా మారింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా నుంచి ఈ సమావేశంలో పాల్గొని, పార్టీ శ్రేణులకు స్పష్టమైన, కఠినమైన, వ్యూహాత్మక దిశానిర్దేశం చేశారు. దాదాపు రెండు గంటల పాటు సాగిన ఈ సమావేశంలో అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల నిర్వహణ, రెబెల్ సమస్యలు, క్షేత్రస్థాయి ప్రచారం, ప్రతిపక్షాల వ్యూహాలు వంటి అంశాలపై సీఎం లోతైన విశ్లేషణతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికలను తేలికగా తీసుకునే ధోరణికి పూర్తిగా స్వస్తి

- మిగతా 2వ పేజీలో



## అంబటి రాంబాబు అరెస్ట్

- సీఎం చంద్రబాబుపై వ్యాఖ్యల కేసులో మాజీ మంత్రి అంబటి అరెస్ట్
- టీడీపీ నేత బాజీ చౌదరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు
- అంబటి ఇంటి వద్ద 6 గంటలకు పైగా టీడీపీ శ్రేణుల నిరసన, ఆందోళన
- తీవ్ర ఉద్రిక్తతల మధ్య అంబటిని వజ్రవాహనంలో తరలించిన పోలీసులు
- అంబటి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన టీడీపీ మంత్రులు, నేతలు

ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబును పోలీసులు అరెస్ట్ చేశారు. గుంటూరులోని నవభారత్ నగర్ లోని నివాసం నుంచి ఆయనను తీవ్ర ఉద్రిక్తత మధ్య పోలీసు వాహనంలోకి ఎక్కించి తరలించారు. వివరాల్లోకి వెళితే, గుంటూరులో తిరుమల లడ్డూల్లో నెయ్యి కల్తీ జరిగిందంటూ టీడీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వివాదంపై స్పందిస్తూ అంబటి రాంబాబు ముఖ్యమంత్రిని ఉద్దేశించి తీవ్రమైన, అసభ్యకర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన టీడీపీ నేతలు, కార్యకర్తలు గుంటూరులోని అంబటి నివాసం వద్దకు భారీగా చేరుకుని ఆందోళన చేపట్టారు. దాదాపు 6 గంటలకు పైగా నిరసన కొనసాగింది. ఈ క్రమంలో ఆయన ఇంటిపై రాళ్లు రువ్వడం, వాహనాలను ధ్వంసం చేయడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.

- మిగతా 2వ పేజీలో





2లో

## 'విజన్'కు వీరతాడు వేస్తారా?

- కేంద్ర బడ్జెట్‌పై గంపెడాశలు పెట్టుకున్న తెలంగాణ
- ఆర్ఆర్ఆర్, మూసీ, మెట్రో, ఫ్యూచర్ సిటీ నిర్మాణం కోసం కేంద్ర సాయం ఆశిస్తున్న రాష్ట్రం
- ఎఫ్ఆర్‌బీఎం రుణ పరిమితి 3 నుంచి 4 శాతానికి పెంచాలని విజ్ఞప్తి
- కేంద్ర పన్నుల్లో వాటా పెంచాలని ఇప్పటికే పలుమార్లు కోరిన ఆర్థిక మంత్రి భట్టి
- ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో రుణాల సేకరణ విషయంలో వెసులుబాటు ఆశిస్తున్న రాష్ట్రం

## కేజీహెచ్ సిబ్బంది నిర్లక్ష్యంతో బిడ్డను కోల్పోయానన్న

- కేజీహెచ్ వైద్యుల నిర్లక్ష్యంతో బిడ్డను కోల్పోయానంటూ మహిళ ఆవేదన
- విశాఖ విమానాశ్రయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు
- బాధ్యులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరిన బాధితురాలు

2లో





2లో

## ఉత్తర 24 పరగణాల్లో అగ్ని విషాదం

- రాజకీయ ఆరోపణల మంట
- 21కు చేరిన మృతుల సంఖ్య
- జమమత ప్రభుత్వంపై అమిత్ షా తీవ్ర విమర్శలు
- ఫైర్ సేఫ్టీ నిబంధనలపై దర్యాప్తు
- రాజకీయంగా వేడెక్కిన బెంగాల్

## ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తా

- కరీంనగర్ సీపీపై తాను వ్యాఖ్యలు చేయలేదని స్పష్టీకరణ.
- ఆరోపణలు రుజువైతే ఎమ్మెల్యే పదవితో పాటు రాజకీయాల నుంచి తప్పుకుంటానన్న ప్రకటన.
- నిరూపించలేకపోతే ఐపీఎస్ అసోసియేషన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలన్న డిమాండ్.
- క్షమాపణ ఇవ్వకపోతే సభా హక్కుల ఉల్లంఘన తీర్మానం పెడతానని హెచ్చరిక.

2లో



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..


## కేజీహెచ్ సిబ్బంది నిర్లక్ష్యంతో బిడ్డను కోల్పోయానన్న

విశాఖపట్నం కింగ్ జార్జ్ హాస్పిటల్ (కేజీహెచ్) వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా గర్భంలోనే తన శిశువు మృతి చెందిందని ఓ మహిళ చేసిన ఫిర్యాదుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెంటనే స్పందించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తనలాంటి పరిస్థితి మరెవరికీ రాకుండా చూడాలని ఆ మహిళ కన్నీటితో వేడుకుంది. ఆమె వేదనకు చలించిన పవన్ కల్యాణ్, బాధిత కుటుంబాన్ని సోమవారం సచివాలయంలోని తన కార్యాలయానికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం రాత్రి తన విశాఖ పర్యటన ముగించుకుని తిరిగి వెళుతున్న సమయంలో విమానాశ్రయంలో పట్నాల ఉమాదేవి అనే మహిళ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిశారు. గత ఏడాది డిసెంబర్ మొదటి వారంలో ప్రసవం కోసం తాను కేజీహెచ్‌లో చేరానని, అప్పటి నుంచి వైద్యులు, సిబ్బంది తన పట్ల అత్యంత నిర్లక్ష్యంగా, అమానవీయంగా ప్రవర్తించారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. "కాన్పుకు ఇచ్చిన గడువు ముగిసిపోయిందని చెప్పినా వారు పట్టించుకోలేదు. సాధారణ ప్రసవం పేరుతో నన్ను నరకయాతనకు గురిచేశారు. నా పరిస్థితి ఆందోళనకరంగా ఉందని కుటుంబ సభ్యులు పదేపదే చెప్పినా వినలేదు. పైగా మాపై తీవ్ర పదజాలంతో దూషించారు. ప్రసవ సమయంలో ఒకరు నా గుండెలపైకి ఎక్కి కూర్చొని నొప్పితో విలవిల్లాడుతున్నా కనికరించలేదు" అని ఉమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమయంలో సిజేరియన్ చేయకపోవడం వల్లే తాను మృత శిశువుకు జన్మనివ్వాల్సి వచ్చిందని ఆమె వాపోయారు. కేజీహెచ్ సిబ్బంది తీరు వల్ల తనకు శారీరక హింసతో పాటు జీవితాంతం మరిచిపోలేని మానసిక వేదన మిగిలిందని ఆమె కన్నీటిపర్యంతమయ్యారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె ఉప ముఖ్యమంత్రిని కోరారు.

## ప్రతి వార్డు విజయం కాంగ్రెస్‌కు కీలకం

(మొదటి పేజీ తరువాయి)

పలకాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇవి సాధారణ స్థానిక ఎన్నికలు కాదని, రాష్ట్ర రాజకీయ దిశను నిర్ణయించే కీలక రాజకీయ యుద్ధమని ఆయన అభివర్ణించారు. ప్రతి డివిజన్, ప్రతి వార్డు గెలుపే పార్టీకి సమిష్టి బలాన్ని ఇస్తుందని, ఒక్క చోట జరిగిన ఓటమి కూడా రాజకీయంగా ప్రతికూల సంకేతాలను పంపుతుందని హెచ్చరించారు. అందుకే ప్రతి స్థాయిలో విజయం సాధించడమే లక్ష్యంగా పార్టీ యంత్రాంగం పనిచేయాలని ఆదేశించారు. అభ్యర్థుల ఎంపిక విషయంలో ఏ కోశానా రాజీపడవద్దని సీఎం కఠినంగా స్పష్టం చేశారు. సామాజిక సమీకరణాల సమతుల్యత, ప్రజల్లో గెలిచే సామర్థ్యం, పార్టీ పట్ల విధేయతఈ మూడు అంశాలు అభ్యర్థుల ఎంపికలో ప్రామాణికంగా ఉండాలని చెప్పారు. కేవలం వ్యక్తిగత పరిచయాలు, వర్గ ఒత్తిళ్లు, సిఫారసుల ఆధారంగా టికెట్లు ఇస్తే దాని ప్రభావం నేరుగా ఎన్నికల ఫలితాలపై పడుతుందని హెచ్చరించారు. గెలుపు గుర్రాలను గుర్తించడంలో నాయకత్వం పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. ప్రతిపక్షాలైన బీజేపీ, బీఆర్ఎస్‌ను తక్కువగా అంచనా వేయకూడదని సీఎం హెచ్చరించారు. వారు ఇప్పటికే క్షేత్రస్థాయిలో వ్యూహాత్మకంగా కదులుతున్నారని, అందుకు తగ్గట్టుగా కాంగ్రెస్ కూడా ప్రతిఎత్తుకు పైఎత్తులతో ముందుకు సాగాలని సూచించారు. అభ్యర్థులు కేవలం పార్టీ గుర్తుపైనే ఆధారపడకుండా, వ్యక్తిగత ప్రతిష్ఠ, ప్రజల్లో విశ్వాసం, నిరంతర క్షేత్రస్థాయి అనుసంధానం కలిగి ఉండాలని చెప్పారు.

## వృద్ధి మంత్రం పొదుపు సూత్రం

దేశ ఆర్థిక దిశను నిర్దేశించే కీలక ఘట్టం నేడు ఆవిష్కృతం కానుంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో 202627 వార్షిక కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. వృద్ధిని కొనసాగిస్తూనే ఆర్థిక క్రమశిక్షణను కాపాడుకోవడంఈ రెండు పరస్పర విరుద్ధ లక్ష్యాల మధ్య సమతుల్యత సాధించడమే ఈ బడ్జెట్‌కు ప్రధాన సవాలుగా నిలవనుందని ఆర్థిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య అనిశ్చితులు, ముడి చమురు ధరల ఒడిదుడుకుల నేపథ్యంలో దేశీయ ఆర్థిక వ్యవస్థను స్థిరమైన వృద్ధి బాటలో నడిపించాల్సిన బాధ్యత ఈ బడ్జెట్‌పై ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వంలో ఇది 15వ కేంద్ర బడ్జెట్ కాగా, నిర్మలా సీతారామన్‌కు ఇది వరుసగా తొమ్మిదో బడ్జెట్. ఈ విషయంలో ఆమె ఒక చారిత్రక రికార్డును సృష్టించనున్నారు. గత బడ్జెట్లలో మౌలిక సదుపాయాలు, మూలధన వ్యయం, సంస్కరణలు, ఆర్థిక క్రమశిక్షణకు ప్రాధాన్యం ఇచ్చిన ప్రభుత్వం, ఈసారి కూడా అదే దిశలో ముందుకు సాగనుందని అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

## ఆరోపణలు నిరూపిస్తే రాజీనామా చేస్తా

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మరియు తెలంగాణ ఐపీఎస్ అధికారుల సంఘం మధ్య మాటల యుద్ధం తీవ్ర స్థాయికి చేరింది. కరీంనగర్ సీపీపై తాను మత మార్పిడులకు సంబంధించిన వ్యాఖ్యలు చేశానంటూ ఐపీఎస్ అసోసియేషన్ చేసిన ఆరోపణలను కౌశిక్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. తాను అలాంటి వ్యాఖ్యలు చేసినట్టు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడమే కాకుండా, రాజకీయాల నుంచే శాశ్వతంగా తప్పుకుంటానని సంచలన సవాల్ విసిరారు. ఈ వివాదంపై మీడియాతో మాట్లాడిన కౌశిక్ రెడ్డి, తన మాటలను వక్రీకరించి తనపై తప్పుడు ఆరోపణలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "కరీంనగర్ సీపీ మత మార్పిడులకు పాల్పడుతున్నారని నేను అన్నట్లు నిరూపించాలి. అలాంటి మాటలు నేను ఎక్కడా చెప్పలేదు. తెలంగాణ ఐపీఎస్ అసోసియేషన్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదు" అని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధిగా తాను మాట్లాడిన ప్రతి మాటకు బాధ్యత వహిస్తానని, కానీ చెప్పని మాటలను తనపై రుద్దడం అన్యాయమని అన్నారు. తనపై చేసిన ఆరోపణలను నిరూపించడంలో ఐపీఎస్ అసోసియేషన్ విఫలమైతే, ఆ సంఘం నాయకులు బేషరతుగా తనకు క్షమాపణ చెప్పాలని కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధి ప్రతిష్ఠను దెబ్బతీయడం తేలికైన విషయం కాదని, నిరాధార ఆరోపణలతో వ్యక్తిగత గౌరవాన్ని హరించడానికి ఎవరికి హక్కు లేదని వ్యాఖ్యానించారు. ఇది కేవలం వ్యక్తిగత వివాదం కాదని, ప్రజాప్రతినిధుల స్వేచ్ఛ, హక్కులపై జరుగుతున్న దాడిగా ఆయన అభివర్ణించారు.

# నోటీసులపై కేసీఆర్ ఘాటు లేఖ

జూబ్లీహిల్స్ ఏసీపీకి మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాసిన లేఖ తెలంగాణ రాజకీయాల్లో మరోసారి కలకలం రేపింది. పోలీసు వ్యవస్థ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, రాజ్యాంగ హక్కులు, చట్టబద్ధ విధానాలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అన్నింటినీ కాలరాస్తున్నారంటూ కేసీఆర్ చేసిన ఆరోపణలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీశాయి. ఇది కేవలం ఒక నోటీసు వ్యవహారం కాదని, ప్రజాస్వామ్య విలువలపై జరుగుతున్న దాడిగా కేసీఆర్ లేఖను రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. తనకు చట్ట ప్రకారం నోటీసులు ఇవ్వకుండా, నంది నగర్‌లోని తన ఇంటి గోడపై నోటీసులు అతికించడం ద్వారా తన వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించారని కేసీఆర్ లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. ఇది ఒక మాజీ ముఖ్యమంత్రిని మాత్రమే కాదు, రాజ్యాంగం గుర్తించిన ప్రతిపక్ష నేత హోదాను కూడా అవమానించే చర్యగా ఆయన అభివర్ణించారు. నోటీసు అనేది చట్టబద్ధమైన ప్రక్రియ అని, అది వ్యక్తిని అవమానించేందుకు ఉపయోగించే సాధనం కాదని ఆయన గుర్తు చేశారు.

బాధ్యతాయుత పౌరుడిగా, ప్రతిపక్ష నేతగా విచారణకు సహకరించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేస్తూనే, పోలీసుల తీరు మాత్రం పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని కేసీఆర్ ఘాటుగా వ్యాఖ్యానించారు. ఫిబ్రవరి 1 మధ్యాహ్నం 3 గంటలకు విచారణకు హాజరయ్యేందుకు సిద్ధమని ప్రకటించినప్పటికీ, చట్టబద్ధతను పక్కనపెట్టి నోటీసులు అంటించడం ద్వారా పోలీసు వ్యవస్థ రాజకీయ ఒత్తిడికి లోనై పనిచేస్తోందని ఆయన ఆరోపించారు. 65 ఏళ్లు దాటిన వారిని వారి నివాసం వద్దనే విచారించాలని చట్టం స్పష్టంగా చెబుతోందని కేసీఆర్ గుర్తు చేశారు. ఇది కేవలం నైతికత కాదు, పార్లమెంట్ రూపొందించిన చట్టమని ఆయన లేఖలో పేర్కొన్నారు. అయినా సరే, ఈ నిబంధనలను పూర్తిగా విస్మరించి నోటీసులు అంటించడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. చట్టం ముందు అందరూ సమానమేనన్న సూత్రం ఇక్కడ వర్తించలేదా అని ప్రశ్నించారు. తన ప్రస్తుత నివాసం ఎర్రవల్లిలో ఉందని, అక్కడే విచారణ జరపాలని కేసీఆర్ స్పష్టం చేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న చిరునామాకు, సెక్షన్ 160 కింద జారీ చేసే నోటీసులకు ఎలాంటి సంబంధం లేదని చట్టపరంగా వివరిస్తూ, పోలీసులు ప్రాథమిక న్యాయ సూత్రాలను కూడా పాటించడం లేదని విమర్శించారు. ప్రస్తుతం నివసిస్తున్న చోట విచారణ జరగాలని పార్లమెంట్ చట్టం స్పష్టంగా చెబుతుంటే, దాన్ని పక్కనపెట్టి వ్యవహరించడం వెనుక రాజకీయ ఉద్దేశాలే ఉన్నాయని ఆరోపించారు.

జూబ్లీహిల్స్ ఏసీపీకి తనను విచారించే అధికార పరిధి లేదని కేసీఆర్ లేఖలో స్పష్టం చేశారు. ఇది కేవలం విధి నిర్వహణలో జరిగిన పొరపాటు కాదని, ఉద్దేశపూర్వకంగా అధికార పరిధిని దాటి చర్యలు తీసుకున్నారని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘిస్తూ నోటీసులు జారీ చేయడం న్యాయవ్యవస్థను అపహాస్యం చేయడమేనని అన్నారు. హరీశ్ రావుకు ఇచ్చిన నోటీసుల విషయంలో పోలీసులు ఒక విధంగా, తన విషయంలో మరో విధంగా వ్యవహరించడం ద్వారా రెండు నాల్కల ధోరణి పాటిస్తున్నారని కేసీఆర్ తీవ్రంగా విమర్శించారు. ఒకే చట్టం, ఒకే నిబంధనలు ఉండగా, వ్యక్తుల్ని బట్టి పోలీసుల ప్రవర్తన మారుతుందా అని ప్రశ్నించారు. ఈ తరహా చర్యలు కోర్టు ధిక్కరణ కిందకు వస్తాయని హెచ్చరించారు. నంది నగర్ నివాసంలోనే విచారణకు అందుబాటులో ఉంటానని ప్రకటిస్తూ, అక్రమ పద్ధతిలో ఇచ్చిన నోటీసులను తాను చట్టపరంగా విస్మరించవచ్చని కేసీఆర్ పేర్కొన్నారు. అయినప్పటికీ, బాధ్యతాయుత పౌరుడిగా, ప్రజాస్వామ్య వ్యవస్థపై నమ్మకంతో విచారణకు హాజరవుతానని చెప్పడం ద్వారా తన వైఖరిని స్పష్టం చేశారు. ఇది చట్టాన్ని గౌరవించే నాయకుడి ధోరణిగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

## 'విజన్'కు వీరతాడు వేస్తారా?

హైదరాబాద్: కేంద్ర వార్షిక బడ్జెట్‌పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గంపెడాశలు పెట్టుకుంది. తెలుగింటి కోడలైన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆదివారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో రాష్ట్రాభివృద్ధికి నిధుల కేటాయింపులు ఉంటాయని ఆశిస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పలు ఆర్థిక ప్రతిపాదనలకు ఈ బడ్జెట్‌లోనైనా మోక్షం కలుగుతుందని.. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న విజన్2047 లక్ష్యాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పన, పారిశ్రామికాభివృద్ధికి ఈ బడ్జెట్ దోహదపడుతుందని అంచనా వేస్తోంది. వాస్తవానికి 202526 వార్షిక బడ్జెట్ సమయంలోనే పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులకు కేంద్ర సహకారం కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు సమర్పించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలతోపాటు పలువురు మంత్రులు, రాష్ట్రానికి చెందిన ఎంపీలు కేంద్ర ప్రభుత్వ పెద్దలను పలుమార్లు కలిసి రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యాలను వివరించారు. గత బడ్జెట్ సందర్భంగా అడిగిన విధంగానే ట్రిపుల్ ఆర్, రేడియల్ రోడ్లు, బందర్ పోర్టుడ్రైపోర్టు గ్రీన్‌ఫీల్డ్ హైవే లాంటి మౌలిక సదుపాయాలు, హైదరాబాద్ అభివృద్ధిలో భాగంగా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, మెట్రో విస్తరణ, సీవరేజ్ మాస్టర్‌ప్లాన్, ఇండస్ట్రియల్ హబ్‌లు, లాజిస్టిక్ పార్కుల ఏర్పాటు, సెమీ కండక్టర్ పరిశ్రమలకు సహకారం లాంటి ప్రతిపాదనలపై ఈసారి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఆశలు పెట్టుకుంది. ఇక రాష్ట్రంలో పారిశ్రామిక కారిడార్ల ఏర్పాటు, వరంగల్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి నిధులు, జిల్లాల్లో లెదర్ పార్కులు, కేంద్రీయ విద్యాలయాలు, జిల్లాకో నవోదయ పాఠశాల, పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదాతోపాటు ఐఐఎం మంజూరు విషయంలోనూ కేంద్రం దయ చూపుతుందనే ఆశాభావంతో ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ స్ఫూర్తిని కేంద్రం అర్థం చేసుకొని ఫ్యూచర్ సిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు తోడ్పాటు అందిస్తుందని.. 2047 నాటికి మూడు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్య సాధనకు ఊతమిచ్చే ప్రతిపాదనలను ప్రవేశపెడుతుందని ఆశిస్తోంది.

## ఇ-సైకిళ్లపై భారీ రాయితీ..

ఏపీలో పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజలకు పర్యావరణ హిత ఇ-సైకిళ్లను భారీ రాయితీపై అందిస్తోంది. ఈ క్రమంలో చిత్తూరు జిల్లా కుప్పంలో 24 గంటల వ్యవధిలో 5,555 ఇ-సైకిళ్లను పంపిణీ చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించింది. పర్యావరణ హితమైన కుప్పం నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. రూ.10 వేల సబ్సిడీ.. రూ.25 వేలకే సైకిల్ ఇ-మోటరాడ్స్ అనే సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పందం ప్రకారం, రూ.35,000 విలువైన ఒక్కో ఇ-సైకిల్‌పై ప్రభుత్వం రూ.10,000 రాయితీ కల్పిస్తోంది. దీంతో ప్రజలు కేవలం రూ.25,000 చెల్లించి ఈ సైకిల్‌ను సొంతం చేసుకోవచ్చు. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే ఈ సైకిల్ 40 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు. విశేషమేమిటంటే ఈ సైకిళ్లను కుప్పంలోనే ఇ-మోటరాడ్ సంస్థ అసెంబుల్ చేస్తోంది. సీఎం చంద్రబాబు తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఈ సైకిళ్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా తూంసీలోని ప్రజావేదిక వద్దకు ఆయన దాదాపు 3 కిలోమీటర్ల దూరం ఇ-సైకిల్‌పై ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం గిన్నిస్ రికార్డు సాధించినందుకు గాను చిత్తూరు జిల్లా కలెక్టర్‌కు ముఖ్యమంత్రి చేతుల మీదుగా ధృవీకరణ పత్రాన్ని అందించారు.

## ఉత్తర 24 పరగణాల్లో అగ్ని విషాదం

పశ్చిమ బెంగాల్ రాష్ట్రం ఉత్తర 24 పరగణాల జిల్లాలో చోటుచేసుకున్న ఘోర అగ్ని ప్రమాదం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. ఆనందపూర్ ప్రాంతంలో ఉన్న గోదాముల్లో జరిగిన ఈ ప్రమాదంలో ఇప్పటివరకు 21 మంది మృతి చెందినట్లు అధికార వర్గాలు ధృవీకరించాయి. ఇంకా శిథిలాల కింద మృతదేహాలు ఉండే అవకాశముందని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తుండటంతో, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ విషాద ఘటన రాజకీయ రంగు పులుముకుని, అధికార తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రతిపక్ష బీజేపీ మధ్య తీవ్ర వాగ్వాదానికి దారి తీసింది. ఈ అగ్నిప్రమాదంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇది కేవలం ప్రమాదం కాదని, మమతా బెనర్జీ ప్రభుత్వ అవినీతే ఈ విషాదానికి కారణమని ఆయన ఆరోపించారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలో జరిగిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన అమిత్ షా, "ఆనందపూర్‌లోని మోమో ఫ్యాక్టరీలో జరిగిన అగ్నిప్రమాదం అత్యంత విషాదకరం. ఇది ప్రమాదం కాదు. మమతా బెనర్జీ ప్రభుత్వ అవినీతికి ప్రత్యక్ష సాక్ష్యం. మోమో ఫ్యాక్టరీలో ఎవరి డబ్బు పెట్టారు? యజమాని ఎవరితో విదేశీ ఫ్లైట్‌లో వెళ్లాడు? ఎందుకు ఇప్పటివరకు అరెస్ట్ చేయలేదు?" అంటూ ఘాటు ప్రశ్నలు సంధించారు. అగ్నిప్రమాదం జరిగిన 32 గంటల తర్వాత మాత్రమే రాష్ట్ర మంత్రి ఘటనాస్థలికి చేరుకున్నారని అమిత్ షా మండిపడ్డారు. కార్మికులు మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోతుంటే ప్రభుత్వం మౌనంగా ఉందని విమర్శించారు. "ఈ అగ్నిప్రమాదం తృణమూల్ కాంగ్రెస్ అవినీతిని బహిర్గతం చేస్తోంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వెంటనే పూర్తి స్థాయి దర్యాప్తుకు ఆదేశించి, బాధ్యులైన వారిని జైలుకు పంపాలి" అని డిమాండ్ చేశారు. ప్రమాద వివరాల్లోకి వెళితే, ఆనందపూర్‌లోని ఒక డెకరేటర్ గోదాములో మొదలైన మంటలు వేగంగా సమీపంలోని మోమో గోదాముకు వ్యాపించాయి. దాదాపు 12,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ గోదాములో ప్యాకేజింగ్ మెటీరియల్, బెవరేజెస్, ఇతర సులభంగా మండే వస్తువులు భారీగా నిల్వ ఉండటంతో మంటలు అదుపు తప్పాయి.

# అంబటి రాంబాబు అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బాజీ చౌదరి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా నల్లపాడు పోలీసులు అంబటిపై కేసు నమోదు చేశారు. తీవ్ర ఉద్రిక్తతల నడుమ, పోలీసులు ఆయన్ను అరెస్ట్ చేసి ప్రత్యేక వజ్రవాహనంలో అక్కడి నుంచి తరలించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు పిల్లి మాణిక్యాలరావు కూడా ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అంబటి వ్యాఖ్యలను మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, నిమ్మల రామానాయుడు, హోం మంత్రి అనిత, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తీవ్రంగా ఖండించారు. అంబటి వ్యాఖ్యలు 'దుర్మార్గం', 'నీచం' అని అభివర్ణిస్తూ, వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై తీవ్ర అసభ్య పదజాలంతో వ్యాఖ్యలు చేశారంటూ వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై తెలుగుదేశం పార్టీ శ్రేణులు భగ్గుమన్నాయి. అంబటి బహిరంగంగా, రెండు చేతులు జోడించి క్షమాపణ చెప్పాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి డిమాండ్ చేశారు. ఆమె నేతృత్వంలో వందలాది మంది టీడీపీ కార్యకర్తలు, మహిళలు గుంటూరు నవభారత్ నగర్‌లోని అంబటి నివాసాన్ని ముట్టడించారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. గల్లా మాధవి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో తరలివచ్చిన టీడీపీ కార్యకర్తలు అంబటి నివాసం వద్దకు దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. ఆయనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఆగ్రహంతో ఉన్న కొందరు కార్యకర్తలు అంబటి ఇంటిపై రాళ్లు రువ్వగా, మరికొందరు ఇంటి బయటన ఉన్న కారును ధ్వంసం చేశారు. టీడీపీ కార్యకర్తల దాడుల్లో ఇంటి కిటికీ అద్దాలు, పూలకుండీలు పగిలిపోయాయి. టీడీపీ మహిళా కార్యకర్తలు చీపురు కట్టలతో నిరసన తెలుపుతూ, అంబటి నివాసంపై కోడిగుడ్లు విసిరారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తిని ఇంతటి అసభ్యకరంగా దూషించడం హేయమైన చర్య. అంబటి రాంబాబు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, ప్రజలందరి ముందు చేతులు జోడించి క్షమాపణ చెప్పాలి" అని డిమాండ్ చేశారు.



మహిళా కార్యకర్తలు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "చంద్రబాబు మాకు దైవంతో సమానం. గతంలో ఆయన కుటుంబసభ్యులను దూషించినప్పుడు సంయమనం పాటించాం. కానీ ఈసారి సహించేది లేదు. అంబటి రాంబాబును వెంటనే అరెస్ట్ చేయాలి, లేదంటే మాకు అప్పగించాలి" అంటూ వారు పోలీసులను డిమాండ్ చేశారు. ఈ ఆందోళనతో అంబటి నివాసం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.



# రైతు వేదికలకు భద్రత ఏది

## నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా మారిన వేదికలు

- నిఘా లేక అపహరణకు గురవుతున్న విలువైన సొత్తు
- పట్టించుకోని వ్యవసాయ శాఖ అధికారులు

**వలిగొండ, జనవరి 31 (తొలివెలుగు):** రైతన్నలకు సాగులో సలహాలు, సూచనలు అందిస్తూ వ్యవసాయాధికారులకు అనుసంధాన వేదికలుగా నిలవాల్సిన 'రైతు వేదికలు' నేడు రక్షణ కరువై వెలవెలబోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగా ఈ భవనాలు దొంగలకు అడ్డాగా మారుతున్నాయి. ఊరికి దూరంగా, శివారు ప్రాంతాల్లో నిర్మించిన ఈ వేదికల్లో భద్రతా ఏర్పాట్లు లేకపోవడంతో విలువైన సామగ్రి మాయమవుతోంది.

**అదును చూసి అపహరణ..**

వలిగొండ మండలంలో మొత్తం 10 రైతు వేదికలు ఉన్నాయి. ప్రస్తుతం వీటిలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రైతు నేస్తం' వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర స్థాయి అధికారులు దృశ్య మాధ్యమం ద్వారా రైతులతో నేరుగా ముచ్చటించేందుకు వీలుగా ప్రభుత్వం లక్షలాది రూపాయలు వెచ్చించి పరికరాలను సమకూర్చింది. ముఖ్యంగా మండల కేంద్రంలోని వేదికలో 62 అంగుళాల భారీ టీవీ సహా ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయి. అయితే, వీటిపై సరైన నిఘా లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

**వైఫల్యానికి ప్రధాన కారణాలు:**

విసిరేసినట్టుగా నిర్మాణాలు: మెజారిటీ రైతు వేదికలు ఊరికి దూరంగా ఉండటంతో రాత్రి సమయాల్లో అక్కడ జనసంచారం ఉండటం లేదు. దీన్ని అదనుగా తీసుకుంటున్న దుండగులు సునాయాసంగా చోరీలకు పాల్పడుతున్నారు.

నిఘా నేత్రాల కరువు: ఏ ఒక్క రైతు వేదిక వద్ద కూడా సీసీ కెమెరాలు లేవు. దీంతో దొంగతనాలు జరిగినప్పుడు విచారణ చేపట్టడం పోలీసులకు సవాలుగా మారుతోంది.

పర్యవేక్షణ లోపం: క్లస్టర్ ఏఈవోల నియంత్రణలో ఉండాల్సిన ఈ వేదికల భద్రతను అధికారులు గాలికొదిలేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో జరిగిన చోరీలపై సరైన విచారణ జరగకపోవడంతో దొంగలకు మరింత బలం చేకూరుతోంది.

లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన ఈ ఆస్తులు దుర్వినియోగం కాకముందే, ఉన్నతాధికారులు స్పందించి కనీసం సీసీ కెమెరాలైనా ఏర్పాటు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.



# కోడ్ అమలుతో 'ప్రజావాణి' రద్దు

- జిల్లా కలెక్టర్ హనుమంతరావు వెల్లడి
- కలెక్టరేట్‌కు రావొద్దని ప్రజలకు విజ్ఞప్తి

**చౌటుప్పల్, జనవరి 31 (తొలివెలుగు):** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్‌ను జనవరి 27న విడుదల చేసిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినట్లు జిల్లా కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. ఈ కారణంగా ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్న కాలంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబోమని స్పష్టం చేసిన కలెక్టర్, ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలని సూచించారు. వివిధ సమస్యలపై అర్జీలు సమర్పించేందుకు కలెక్టరేట్‌కు రావద్దని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన అనంతరం ప్రజావాణి కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించే విషయంపై సమాచారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు.

# ఖైతపురం ఎక్స్ రోడ్డు వద్ద రోడ్డు ప్రమాదం

- కంటైనర్‌ను ఢీకొన్న కెమికల్ ట్యాంకర్
- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



**చౌటుప్పల్, జనవరి 31 (తొలివెలుగు):** ముందు వెళ్తున్న వాహనం ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వచ్చిన కెమికల్ ట్యాంకర్ దానిని బలంగా ఢీకొన్న ఘటన శనివారం తెల్లవారుజామున ఖైతపురం ఎక్స్ రోడ్డు వద్ద చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డాడు. సీఐ మన్మథ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన బరం దేవ్ యాదవ్ (50), వైజాగ్ నుంచి హైదరాబాద్‌లోని డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్‌కు కెమికల్ లోడుతో ట్యాంకర్ (ఎంహెచ్ 43 బిఎక్స్ 9932)లో వెళ్తున్నాడు. శనివారం తెల్లవారుజామున సుమారు 5.30 గంటల సమయంలో ఖైతపురం వద్దకు చేరుకోగానే ముందుగా వెళ్తున్న కంటైనర్ లారీ (ఎంహెచ్ 42 బిఎఫ్ 5959) డ్రైవర్ ఎటువంటి ముందస్తు సంకేతాలు ఇవ్వకుండా అకస్మాత్తుగా బ్రేక్ వేశాడు. దీంతో వెనుక నుంచి వస్తున్న ట్యాంకర్ నియంత్రణ కోల్పోయి కంటైనర్‌ను ఢీకొట్టింది. ప్రమాద ధాటికి ట్యాంకర్ ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జవ్వగా, డ్రైవర్ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు అతడిని చౌటుప్పల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. రూపేష్ రాజ్ బార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



**చౌటుప్పల్, జనవరి 31 (తొలివెలుగు):** లారీ డ్రైవర్ నిర్లక్ష్యం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. హైదరాబాద్ నుంచి నల్గొండకు బుల్లెట్‌పై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని టోలిచౌకికి చెందిన మహమ్మద్ కాజా పాయాజుద్దీన్ (35) శనివారం మధ్యాహ్నం తన తమ్ముడి బుల్లెట్ బైక్ (టీజీ 10 8644) పై నల్గొండకు బయలుదేరారు. మధ్యాహ్నం 01:34 గంటల సమయంలో చౌటుప్పల్ మండలం ఆరెగూడెం స్టేజి వద్దకు చేరుకోగా, అప్పటికే ముందు వెళ్తున్న లారీ (టీజీ 05 టీ 1015) డ్రైవర్ ఎటువంటి సంకేతాలు ఇవ్వకుండా ఒక్కసారిగా అతివేగంగా యూటర్న్ తీసుకున్నాడు. ఈ క్రమంలో బుల్లెట్ లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పాయాజుద్దీన్ ఎడమ కాలు, చేతి వేలికి రక్తగాయాలవడంతో పాటు ఛాతికి తీవ్ర అంతర్గత గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌లో చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడి తమ్ముడు మహమ్మద్ కాజా ఫహీముద్దీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

# చౌటుప్పల మున్సిపాలిటీలో సీపీఎం అభ్యర్థుల పోటీ

- పోరాట పటిమ కలిగిన కమ్యూనిస్టులనే గెలిపించాలి
- పదవులు ఆభరణం కాదు.. పోరాటానికి ఆయుధం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, జిల్లా కార్యదర్శి: ఎండీ జాహంగీర్

**చౌటుప్పల, జనవరి 31 (తొలివెలుగు):** చౌటుప్పల మున్సిపాలిటీలో సీపీఎం పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడగల కమ్యూనిస్టులనే గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, జిల్లా కార్యదర్శి ఎండీ జాహంగీర్ ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం చౌటుప్పల మండల కమిటీ సమావేశం జిల్లా కమిటీ సభ్యుడు రాగిరు కిష్టయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎండీ జాహంగీర్ మాట్లాడుతూ.. నేటి రాజకీయాలు వ్యాపారంగా మారుతున్నాయని, డబ్బు రాజకీయాలను ప్రజలు తిరస్కరించాలని సూచించారు. ప్రజా సమస్యలను పట్టించుకోని నాయకులు ప్రలోభాలకు గురిచేసి ఎన్నికల్లో గెలవాలనే ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలని అన్నారు. పదవులు ఆభరణం కాదని, అవి ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడే ఆయుధాలని స్పష్టం చేశారు. అలాంటి పోరాట పటిమ కలిగిన కమ్యూనిస్టులకే ప్రజలు తమ ఓటు వేయాలని కోరారు. చౌటుప్పల మున్సిపాలిటీలో నెలకొన్న అనేక సమస్యలపై ప్రజా ఉద్యమాలు నిర్వహించిన ఘనత సీపీఎం పార్టీదేనని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి, జి. శ్రీనివాస్ చారి, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశం, మండల కార్యదర్శి గంగాదేవి సైదులు, మండల కార్యదర్శివర్గ సభ్యులు చీరిక సంజీవరెడ్డి, చింతల సుదర్శన్, బోయ యాదయ్య, మండల కమిటీ సభ్యులు ఆదిమూలం నందీశ్వర్, అంతటి అశోక్, కొండే శైలం, ఎలమల్ల సంజీవ, మీసాల శీను, కొంతం సుశీల, రోడ్డ సోని తదితరులు పాల్గొన్నారు.




# కిషోర్ కుమార్‌కు 'గద్దర్ స్ఫూర్తి' పురస్కారం

**హైదరాబాద్/సూర్యాపేట, జనవరి 31 (తొలివెలుగు):** ప్రజా యుద్ధనౌక, విప్లవ కవి గద్దర్ జయంతిని పురస్కరించుకుని ప్రముఖ సామాజిక కార్యకర్త, కవి డాక్టర్ పల్లె కిషోర్ కుమార్కు గద్దర్ స్ఫూర్తి అవార్డును అందజేశారు. నగరంలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళామందిరంలో శనివారం ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్, ఎండోక్నిడియన్ యూత్ కౌన్సిల్, పుడమి సాహితి వేదిక సంస్థలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. గద్దర్ కుమార్తె, ప్రముఖ వైద్యురాలు డాక్టర్ వెన్నెల చేతుల మీదుగా కిషోర్ కుమార్ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. తెలంగాణ ఉద్యమంలో తన గళంతో ప్రజలను చైతన్యపరచడంతో పాటు, కవిగా, తబలా కళాకారుడిగా, సామాజిక సేవా రంగాల్లో చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. గద్దర్ స్ఫూర్తితో ప్రజాసేవను మరింత ఉధృతంగా కొనసాగిస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాలాచారి, ఎండోక్నిడియన్ యూత్ కౌన్సిల్ వ్యవస్థాపకులు శేష సాయి, పుడమి సాహితి వేదిక జాతీయ అధ్యక్షుడు చిలుమల బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# ముగిసిన నామినేషన్ల పరిశీలన

- 126 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమం
- ఎన్నికల అధికారి జి. వెంకటరామ్ రెడ్డి

**చౌటుప్పల్, జనవరి 31 (తొలివెలుగు):** చౌటుప్పల్ పురపాలక సంఘం రెండో సాధారణ ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైన నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) శనివారం ముగిసింది. స్థానిక ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జరిగిన ఈ ప్రక్రియను రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) స్వయంగా పర్యవేక్షించారు. మొత్తం 20 వార్డుల నుంచి వివిధ పార్టీలకు చెందిన 126 మంది అభ్యర్థులు 191 సెట్ల నామినేషన్ పత్రాలను సమర్పించారు. అధికారులు అభ్యర్థులు సమర్పించిన ధ్రువీకరణ పత్రాలు, సాంకేతిక అంశాలను నిశితంగా పరిశీలించిన తర్వాత 126 మంది అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు ధ్రువీకరించారు. ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్ పర్యవేక్షణలో అభ్యర్థుల సమక్షంలోనే ఈ పరిశీలన పారదర్శకంగా జరిగింది. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ బందోబస్తు మధ్య ప్రక్రియను పూర్తి చేశారు. ఎన్నికల నిబంధనలను తూచా తప్పకుండా పాటిస్తూ పారదర్శకతకు పెద్దపీట వేసినట్లు ఆర్డీఓ శేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామ్ రెడ్డి వెల్లడించారు.







# అంతర్జాతీయ కరాటేలో జతీష్‌కు రెండు స్వర్ణాలు

**నల్గొండ/మద్దిరాల, జనవరి 31 (తొలివెలుగు):** నల్గొండ జిల్లాకు చెందిన కరాటే క్రీడాకారుడు మీసాల జతీష్ అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటి జిల్లాకు గర్వకారణంగా నిలిచాడు. విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం (జనవరి 30) నిర్వహించిన 9వ ఆల్ స్టైల్స్ ఇన్విటేషనల్ కరాటే ఛాంపియన్ షిప్2026లో జతీష్ రెండు విభాగాల్లో బంగారు పతకాలు సాధించాడు. యునైటెడ్ షోటోఖాన్, మహిర షోటోఖాన్ కరాటే డూ ఇండియా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అంతర్జాతీయ పోటీల్లో నాలుగు దేశాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. మద్దిరాల మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన మీసాల ఎల్లేష్‌మమత దంపతుల కుమారుడైన జతీష్, కటాస్ విభాగంలో ఒకటి, కుమితే విభాగంలో మరొకటి చొప్పున రెండు స్వర్ణ పతకాలను కైవసం చేసుకున్నాడు. కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్న జతీష్ చిన్నప్పటి నుంచే క్రీడల్లో చురుగ్గా పాల్గొంటూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడం అభినందనీయమని కోచ్ మహేష్ నాయక్ ప్రశంసించారు.

## సేవలకు గుర్తింపు.. ఏఈ సతీష్‌కు పురస్కారం

**యాదవ సంఘ నేతల అభినందనలు**



**చౌటుప్పల్, జనవరి 31 (తొలివెలుగు):** విద్యుత్ రంగంలో విశేష సేవలు అందించి జిల్లా స్థాయి ఉత్తమ అధికారి పురస్కారం అందుకున్న చౌటుప్పల్ విద్యుత్ శాఖ ఏఈ సతీష్ కుమార్ యాదవ్‌ను యాదవ సంఘం నేతలు శనివారం ఘనంగా సన్మానించారు. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా భువనగిరి జిల్లా కేంద్రంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఎస్పీ అక్షాంశ్ యాదవ్ చేతుల మీదుగా సతీష్ కుమార్ యాదవ్ ఈ పురస్కారాన్ని స్వీకరించారు. ఈ నేపథ్యంలో చౌటుప్పల్ మండల, పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు చినుకని మల్లేశం యాదవ్ మాట్లాడుతూ.. సతీష్ కుమార్ తన విధుల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి అవార్డు సాధించడం గర్వకారణమన్నారు. అనంతరం ఏఈ సతీష్ కుమార్ యాదవ్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో గుండెబోయిన అయోధ్య యాదవ్, చిలకల శ్రీనివాస్ యాదవ్, నల్ల పర్వతాలు యాదవ్, గంగనబోయిన వెంకటేష్ యాదవ్, గజ్జి పాండు యాదవ్, నల్ల గణేష్ యాదవ్, ఆవుల ఏసు యాదవ్, ఆవుల మల్లయ్య యాదవ్, గుండెబోయిన వేణు యాదవ్, గుణమోని లింగస్వామి యాదవ్, గుణమోని బాలకృష్ణ యాదవ్, బద్దుల సుధాకర్ యాదవ్, మెండే మల్లేష్ యాదవ్, ఎం. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

**వలిగొండ, జనవరి 31 (తొలివెలుగు):** వలిగొండ మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పొద్దుటూరు గ్రామానికి చెందిన బుంగమట్ల శ్రీనివాస్ (26), శుక్రవారం తన తమ్ముడు శివకుమార్ తో కలిసి పొలం వద్దకు వెళ్ళాడు. గొర్రెల వద్దే ఉండి కాసేపటి తర్వాత వస్తానని శ్రీనివాస్ చెప్పడంతో తమ్ముడు ఇంటికి తిరిగి వచ్చాడు. చాలా సమయం గడిచినా శ్రీనివాస్ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తమ్ముడు శివకుమార్ అతనికి ఫోన్ చేశాడు. ఫోన్ రింగ్ అవుతున్నా శ్రీనివాస్ లిఫ్ట్ చేయలేదు. దీంతో అనుమానం వచ్చి తండ్రి నరసింహతో కలిసి పొలం వద్దకు వెళ్లి చూడగా, శ్రీనివాస్ నోటి నుండి నురుగు వస్తూ అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. కుటుంబ సభ్యులు వెంటనే శ్రీనివాస్‌ను భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించగా, శనివారం చికిత్స పొందుతూ శ్రీనివాస్ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి బుంగమట్ల నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ యుగేందర్ గౌడ్ తెలిపారు.



# కాంగ్రెస్‌లో చేరిన జనసేన మండల అధ్యక్షుడు శివారెడ్డి





**- చౌటుప్పల్ రాజకీయాల్లో కీలక పరిణామం**

**చౌటుప్పల్, జనవరి 31 (తొలివెలుగు):** చౌటుప్పల్ మండల రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. జనసేన పార్టీకి చెందిన కీలక నేతలు అధికార కాంగ్రెస్ పార్టీలో చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామానికి చెందిన జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పర్నే శివారెడ్డి, ఆయన సతీమణి రజిత శనివారం తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య శివారెడ్డి దంపతులకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు పర్నే శివారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. శివారెడ్డితో పాటు జనసేన పార్టీలో కీలక పాత్ర పోషిస్తున్న బంగారు అంజి, బీజేపీకి చెందిన ఎర్ర ఉషయ్య తదితరులు కూడా కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరి చేరికతో లింగోజిగూడెం గ్రామంతో పాటు మండల కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బి.ఎన్. రెడ్డి, మాజీ జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్ రెడ్డి, మునుగోడు కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పబ్బు రాజు గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఇంద్రసేన రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బోయ దేవేందర్, గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కీలక నాయకుల చేరికతో మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కానుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## ప్రియుడి భార్యను పెట్రోల్ పోసి హతమార్చిన ఘటనలో పసి కందు మృతి

నాంపల్లి, జనవరి 31 : నల్లగొండ జిల్లా నాంపల్లి మండలం కేతపల్లిలో శనివారం దారుణ సంఘటన జరిగిన విషయం తెలిసిందే. ప్రియుడి భార్యపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో ప్రియుడి బాబు (6 నెలలు) సైతం మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కేతేపల్లి గ్రామానికి చెందిన నగేశ్ యాదవ్, మమత(25) ఇరువురు దంపతులు. వీరికి ఆరు నెలల వయస్సు ఉన్న బాబు ఉన్నాడు. అయితే నగేశ్ యాదవ్‌కు, అదే గ్రామానికి చెందిన సుజాతకు మధ్య వివాహేతర సంబంధం ఉంది. సుజాతకు పెండ్లి అయి భర్త గతంలోనే చనిపోయాడు. ఈమెకు ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఈ క్రమంలో తన ఇద్దరు కూతుర్లలో ఒకరిని పెండ్లి చేసుకోవాల్సిందిగా నగేశ్‌పై ఒత్తిడి చేస్తూ వస్తున్నట్లుగా సమాచారం. సుజాత ప్రతిపాదనను నగేష్ తిరస్కరించడంతో పగ పెంచుకుంది. భార్యాబిడ్డా ఉండడంతోనే అతడు తిరస్కరిస్తున్నట్లుగా భావించిన సుజాత వారి అడ్డు తొలగించాలనే ఉద్దేశ్యంతో శనివారం



నగేశ్ ఇంటికి వెళ్లి మరీ ఈ దారుణానికి పాల్పడింది. తన చిన్నారి బాబుకు పాలు ఇస్తున్న మమతపై సుజాత తన వెంట సంచిలో తెచ్చుకున్న పెట్రోల్, కారం, కత్తిలో పెట్రోల్‌ను తీసి ఒక్కసారిగా వారిమీద పోసి నిప్పంటించింది. దీంతో మంటలకు తాళలేక మమత తన ఒడిలోని చంటిబిడ్డను రక్షించుకునేందుకు ఒక్కసారిగా కిందకు విసిరేసి మంటల్లో సజీవ దహనమైంది. తీవ్ర గాయాలైన బాబును చికిత్స కోసం హుటాహుటిన హైదరాబాద్ నిలోఫర్‌కు తరలించగా పరిస్థితి విషమించడంతో బాబు సైతం మృతిచెందాడు. ఈ హృదయ విదారక ఘటనతో ఊరిలో అంతటా విచారం నెలకొంది. నిందితురాలు నాంపల్లి పోలీస్ స్టేషన్ లో లొంగిపోయినట్లు సమాచారం.

## కొండమడుగు శివారులో ఘోర రోడ్డు ప్రమాదం

**ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన టిప్పర్ ఇద్దరికి తీవ్ర గాయాలు**

బీబీనగర్, జనవరి 31 : బీబీనగర్ మండల పరిధిలోని కొండమడుగు గ్రామ శివారులో శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరు కార్మికులు క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. ప్రమాదంలో హరి అనే వ్యక్తికి ఒక కాలు పూర్తిగా తెగిపోగా, బిలాల్ అనే వ్యక్తికి ఒక కాలు పూర్తిగా తెగిపోవడంతో పాటు మరో కాలు విరిగింది. తీవ్రంగా గాయపడ్డ ఇరువురిని స్థానికులు వెంటనే బయటకు తీసే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుంది. ప్రాథమిక చికిత్స అందించి, క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

# 'రోడ్డు భద్రతపై సమాజాన్ని జాగృతం చేయాలి'




బీబీనగర్, జనవరి 31 : రోడ్డు భద్రత పట్ల సమాజంలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అడిషనల్ ఎస్పీ సిహెచ్.లక్ష్మీనారాయణ అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ పరిధిలోని గూడూరు వద్ద ఉన్న హైదరాబాద్‌యాదగిరి టోల్ ప్లాజా ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రత మాసోత్సవాల ముగింపు సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రయాణ సమయంలో వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు రోడ్డు భద్రతపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నెల రోజులుగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమ నిబంధనల పాటింపు విషయంలో ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని హెచ్చరించారు. యాదాద్రి జిల్లా పోలీస్ శాఖ ప్రజల రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ, ప్రమాదాలను తగ్గించి ప్రతి పౌరుడి ప్రాణాన్ని కాపాడే దిశగా మరింత సమగ్రమైన అవగాహన కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. అనంతరం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి ప్రభాకర్ రెడ్డి, ఆర్టీఎ సాయి కృష్ణ, టోల్ ప్లాజా జనరల్ మేనేజర్ చంద్రమోహన్, మేనేజర్ నాగేశ్వరరావు, సిఐలు మధుసూదన్, ఇమ్రాన్, ఎస్సైలు అమర్ సింగ్, లక్ష్మణ్, ఆనంద్, శ్యాం ప్రసాద్, ప్రణీత్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, వెంకన్న, మధుసూదన్, పోలీస్ సిబ్బంది, టోల్ ప్లాజా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..




## ఎన్సీపీశాసనసభా పక్ష నేతగా సునేత్రా పవార్ ఏకగ్రీవం..

**మహారాష్ట్ర తొలి మహిళా డిప్యూటీ సీఎంగా రికార్డ్..**

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) శాసనసభా పక్ష నేతగా అజిత్ పవార్ భార్య సునేత్రా పవార్‌ను ఏరకగ్రీంగా ఎన్నుకున్నారు. అజిత్ పవార్ మరణించిన మూడు రోజులకే ఆమెకు ఈ కీలక బాధ్యతలు చేపట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాజ్యసభ సభ్యురాలిగా ఉన్న సునేత్రా పవార్‌కు, శనివారం జరిగిన కీలక సమావేశంలో ఈ పదవిని కట్టబెట్టారు. ఈ సమావేశం ముంబైలోని విధాన్ భవన్ సముదాయంలోని అజిత్ పవార్ కార్యాలయంలో జరిగింది. ఆమె పేరును ఎన్సీపీ సీనియర్ నేత దిలీప్ వాల్సే పాటిల్ ప్రతిపాదించగా, మంత్రి ఛగన్ బుజ్‌బల్ మద్దతు తెలిపారు. ఈ సమావేశంలో అజిత్ పవార్ చిత్రపటానికి పూలమాల వేసి సునేత్ర నివాళు లర్పించారు. ఈ సమావేశానికి అజిత్ పవార్ చిన్న కుమారుడు జై పవార్, మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. మూడు రోజుల క్రితం బారామతిలో ఒక కార్యక్రమానికి వెళ్తున్న అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించారు. ఆయనతో పాటు మొత్తం ఐదుగురు ఈ ప్రమాదంలో మృతి చెందారు. ఇదిలా ఉంటే, ఈ రోజు సాయంత్రం సునేత్రా పవార్ మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా పదవీ ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మహారాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఒక మహిళా ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.

2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో సునేత్రా పవార్ క్రియాశీలక రాజకీయాల్లోకి వచ్చారు. బారామతి నుంచి శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలేపై పోటీలో నిలబడ్డారు. అయితే, ఈ ఎన్నికల్లో ఆమె ఓడిపోయారు. ఆ తర్వాత రాజ్యసభకు ఎన్నికై జాతీయ రాజకీయాల్లో అడుగుపెట్టారు. అజిత్ పవార్ ఆకస్మిక మరణంతో ఎన్సీపీ బాధ్యతలు సునేత్రా తీసుకోవాల్సి వస్తోంది. అజిత్ పవార్ మరణం తర్వాత పార్టీ స్థిరత్వం, నిరంతర నాయకత్వం కల్పించాలనే ఉద్దేశంతో సునేత్రా పవార్‌కు ఈ బాధ్యతలు అప్పగించినట్లు రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

## 1వ క్లాస్ బాలికపై లైంగిక వేధింపులు.. ప్రభుత్వ ఉపాధ్యాయుడు అరెస్ట్..



మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని తికమ్‌గఢ్ జిల్లాలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకున్న ఘటన తీవ్ర కలకలం రేపింది. మొదటి తరగతి చదువుతున్న మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలపై ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గురువారం ఉదయం మైనర్ బాలిక పాఠశాలకు వెళ్లిన సమయంలో అక్కడ పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఆమెతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పాఠశాల నుంచి ఇంటికి తిరిగివచ్చిన బాలిక ఈ విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు, కొంతమంది గ్రామస్తులతో కలిసి పలేరా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే స్పందించి కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ (పూజుూా) చట్టంతో పాటు దీచీూలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, నిందితుడైన ఉపాధ్యాయుడిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ విషయమై తికమ్‌గఢ్ జిల్లా అదనపు పోలీసు సూపరింటెండెంట్ విక్రమ్ సింగ్ మాట్లాడుతూ.. పలేరా పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలు నమోదయ్యాయి. ఈ మేరకు నిందితుడిపై పోక్సో చట్టం, దీచీూ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, అతడిని అరెస్టు చేసి జైలుకు పంపించాం అని తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

## అంబటి రాంబాబు వ్యాఖ్యలపై జనసేన రియాక్షన్..

అంబటి రాంబాబు వ్యాఖ్యలపై జనసేన పార్టీ రియాక్ట్ అయ్యింది. అంబటి రాంబాబు అహంకారపూరిత వ్యాఖ్యలపై, అసభ్యకర బూతులపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తే సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో ఒక పోస్ట్ చేసింది. "వైసీపీ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు సాక్ష్యాత్తు శ్రీవారి సొమ్ము రూ. 250 కోట్లు దోపిడీ చేయడమే కాకుండా, పవిత్రమైన శ్రీవారి ప్రసాదం లడ్డు తయారీలో ఆవు నెయ్యి బదులుగా, 68 లక్షల కేజీల కల్తీ కెమికల్ నెయ్యి వాడటమే కాకుండా, ూఔ రిపోర్ట్ ద్వారా 36 మంది ఈ పాపంలో భాగం అయ్యారు అని చెప్పినా సరే ప్రభుత్వంపై నిందలు వేస్తారా? మీరు చేసిన తప్పులు ప్రజలకు వివరించేలా ఫ్లెక్సీలు వేయిస్తే రౌడీయిజంతో వాటిని తొలగించే ప్రయత్నం చేస్తారా? మీరు చేసేది తప్పు అని అడ్డుకుంటే సాక్ష్యాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మీద సభ్య సమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు చేస్తారా? అంబటి చేసినవి విమర్శలు కాదు, ఇది తప్పు చేసిన మమ్మల్ని ఏమీ చేయలేరు అనే అహంకారంతో వాగిన చిల్లర వాగుడుడ్‌ా= బూతు పార్టీ నాయకుడిగా బండ బూతులతో రెచ్చి పోయిన అంబటి రాంబాబును తక్షణమే అరెస్ట్ చేయాలి. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవాన్ని కాపాడలేకపోతే ఇక సామాన్యులపై జరిగే దాడులను ఎలా అరికడతాం? ఒక మాజీ మంత్రిగా హుందాగా వ్యవహరించాల్సిన అంబటి రాంబాబు బజారు రౌడీలా ప్రవర్తిస్తే ప్రజలకు ఏం సందేశం ఇచ్చినట్లు? రాష్ట్ర ముఖ్యమంత్రిపై అంబటి రాంబాబు చేసిన వ్యాఖ్యలను సుమోటోగా స్వీకరించి పోలీసులు అరెస్ట్ చేయాలి.. భవిష్యత్తులో ఇలా మరే ఇతర నాయకుడు ప్రవర్తించకుండా న్యాయస్థానం కఠినంగా శిక్షించాలి." అని జనసేన పార్టీ డిమాండ్ చేసింది.

# ప్రతీ 10 లక్షల మందికి కేవలం 22 మంది జడ్జీలు..

**ఒత్తిడిలో భారత న్యాయవ్యవస్థ..**

**న్యాయమూర్తుల కొరతతో ఇబ్బందులు..**

**ప్రతీ 10 లక్షల మందికి కేవలం 22 మంది జడ్జీలు..**

**ఉండాల్సిన సంఖ్యలో సగం కూడా లేని వైనం..**



భారతీయ న్యాయ వ్యవస్థ తీవ్రమైన ఒత్తిళ్లతో సతమతమవుతోంది. దేశంలో ప్రతీ 10 లక్షల మందికి కేవలం 22 మంది న్యాయమూర్తులు ఉన్నారు. న్యాయ మంత్రిత్వ శాఖ ప్రకారం, ఉండాల్సిన సంఖ్య కన్నా ఇది తక్కువ. సకాలంలో న్యాయం జరగాలంటే జనాభాకు తగినంత మంది జడ్జీలు లేరని తెలుస్తోంది. 2011 జనాభా లెక్కల ప్రకారం, 2026 నాటికి ఉండాల్సిన న్యాయమూర్తుల సంఖ్యను పరిగణలోకి తీసుకుని లెక్కించినట్లు కేంద్రం తెలిపింది. అధికారిక వివరాల ప్రకారం, సుప్రీంకోర్టులో మొత్తం 34 మంది న్యాయమూర్తులకు గానూ ప్రస్తుతం 33 మంది మాత్రమే ఉన్నారు. హైకోర్టులో 1122 మంది న్యాయమూర్తులు ఉండాలి, కానీ ప్రస్తుతం 814 మంది మాత్రమే పనిచేస్తున్నారు. అత్యధిక కేసులు జిల్లా, దిగువ కోర్టుల్లోనే ఉన్నాయి. ఈ కోర్టుల్లో 20,833 మంది న్యాయమూర్తులు పనిచేస్తున్నారు. అయినా కూడా పెండింగ్ కేసులు తగ్గించడానికి ఈ సంఖ్య సరిపోవడం లేదని న్యాయ నిపుణులు చెబుతున్నారు. ప్రధాన కోర్టుల్లో గణనీయంగా న్యాయమూర్తుల కొరత ఉంది. లా కమిషన్ ఆఫ్ ఇండియా తన 120వ నివేదికలో ప్రతీ 10 లక్షల మందికి 50 మంది న్యాయమూర్తులు ఉండాలని సూచించింది. ఈ సంఖ్యలో సగం కూడా ప్రస్తుతం లేరు. కోర్టులపై ఉన్న ఒత్తిడి జైళ్లలో కనిపిస్తోంది. నేషనల్ క్రైమ్ బ్యూర్ ప్రకారం, 2023 నాటికి 3,89,910 మంది అండర్ ట్రయల్ ఖైదీలు జైళ్లలో ఉన్నారు. సత్వర న్యాయం కోసం కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపట్టింది. కోర్టుల మౌలిక సదుపాయాలను మెరుగుపరడచంతో పాటు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ఆర్థిక సహాకారంతో పాటు పారదర్శకతను మెరుగుపరచడానికి ఈ-కోర్టులు మిషన్ మోడ్ ప్రాజెక్ట్ ద్వారా టెక్నాలజీని తీసుకువస్తోంది.

# మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌తో పాకిస్తాన్‌లో భయం మొదలు..

**భారత్-ఈయూ ట్రేడ్ డీల్‌తో పాకిస్తాన్‌లో కంగారు..**

**తమ మార్కెట్ దెబ్బతింటుందని దాయాదిలో భయం..**



"మదర్ ఆఫ్ ఆల్ డీల్స్"గా చెప్పబడుతున్న ఇండియా-యూరోపియన్ యూనియన్ (జుఖ) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం(ఖీూా) అమెరికాతో పాటు పాకిస్తాన్‌కు కూడా ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా, ఆర్థిక సంక్షోభంతో ఇబ్బందులు పడుతున్న దాయాది దేశానికి ఈ ఒప్పందం మరింత ఆందోళనలను, భయాన్ని కలిగిస్తోంది. పాక్ నుంచి యూరప్‌కు ఎక్కువగా వస్త్రాలు, దుస్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ డీల్‌తో పాకిస్తాన్ వ్యాపారానికి భారత్ గండికొడుతుంది. యూరోపియన్ యూనియన్ పాకిస్తాన్‌కు రెండో అతిపెద్ద ఎగుమతి మార్కెట్. దాని వార్షిక ఎగుమతుల్లో 9 బిలియన్ డాలర్లు( రూ. 8.25 లక్షల కోట్లు) ఉన్నాయి. ఇప్పుడు ఇది ప్రమాదంలో పడింది. భారత్‌తో వాణిజ్య ఒప్పందం తర్వాత తమ ఎగుమతులపై ప్రభావం పడకుండా ఈయూతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పాక్ విదేశాంగ మంత్రిత్వ శాఖ శుక్రవారం తెలిపింది. భారత్-ఈయూ మధ్య డీల్ ఒకే కావడంతో పాక్ ప్రభుత్వం కంగారులో పడింది. పాక్ డిప్యూటీ పీఎం ఇషాక్ దార్‌తో మంత్రులు సమావేశమయ్యారు. దీనికి ముందు పాక్ ప్రధాని, ఈయూ రాయబారి మధ్య సమావేశం జరిగింది.

**పాక్ భయాలకు కారణం ఇదే..**

భారత్-ఈయూ డీల్‌తో పాక్ ఎగుమతులు ప్రశ్నార్థకంగా మారుతాయి. ప్రపంచ బ్యాంక్ నివేదిక ప్రకారం, పాక్ ఎగుమతి వాటా 1990లో జీడీపీలో 16 శాతం ఉంటే, ఇది 2024లో దాదాపు 10 శాతానికి పడిపోయింది. మరోవైపు, ఈయూ పాకిస్తాన్‌కు జనరలైజ్డ్ సిస్టమ్ ఆఫ్ ప్రిఫరెన్సెస్ ప్లస్ (+ూూ+) హోదా ఇచ్చింది. దీని ద్వారా పాక్ 66 శాతం ఎగుమతులు ఎలాంటి సుంకాలు లేకుండా ఈయూ మార్కెట్‌లోకి వెళు తున్నాయి. దీని కారణంగా పాకిస్తాన్ యూరప్‌కు వస్త్ర ఎగుమతులు 108 శాతం పెరిగాయి. పాక్ ఇచ్చిన ఈ హోదా వచ్చే ఏడాదితో ముగుస్తోంది. ఇది పాక్‌లో మరింత భయాన్ని పెంచుతుంది. పాక్ పారిశ్రామిక ఉత్పత్తుల్లో వస్త్రరంగం అతిపెద్దది. ఈ రంగం 15 నుంచి 25 మిలియన్ల మందికి ఉపాధి ఇస్తుంది.

**భారత్‌కు ప్రయోజనం:**

భారత్ వస్త్ర ఎగుమతులు ప్రస్తుతం ఈయూ మార్కెట్‌లో 12 శాతం సుంకాలను ఎదుర్కొంటున్నాయి. వాణిజ్య ఒప్పందం కుదిరితే వెంటనే భారతీయ వస్త్ర ఎగుమతులపై జీరో సుంకాలు అమలవుతాయి. భారత్ నుంచి ఈయూకు వెళ్లే దాదాపు 99 శాతం ఉత్పత్తులకు ఎలాంటి సుంకాలు ఉండవు. ఈయూ నుంచి వచ్చే 97 శాతం సరకులకు సుంకాలు ఉండవు. ట్రంప్ సుంకాలతో దెబ్బతిన్న దుస్తులు, రత్నాలు, ఆభరణాలు, ఫుట్‌వేర్ ఇండస్ట్రీలు ఈ డీల్‌తో మళ్లీ పుంజుకోనున్నాయి. భారత్ ఎగుమతులతో యూరప్ మార్కెట్ నిండిపోతే, పాకిస్తాన్‌కు ఇబ్బందులు తప్పవు.

**పాక్‌పై తీవ్ర ప్రభావం:**

ఈయూతో ట్రేడ్ డీల్‌తో ఇప్పుడు మొత్తం పరిస్థితి మారుతుంది. భారత ఉత్పత్తులు ఈయూ మార్కెట్‌లో గణనీయమైన పోటీని ఇస్తాయి. ఈయూ తన వాణిజ్యాన్ని అమెరికా, చైనాలను దాటి వైవిధ్యపరచాలని అనుకుంటోంది. ఈ నేపథ్యంలో పాకిస్తాన్‌కు హోదా పొడిగిస్తుందా లేదా అనేది ఇంకా స్పష్టం కాలేదు. పాక్ మాజీ వాణిజ్య మంత్రి డాక్టర్ గోహర్ ఎజాజ్ మాట్లాడుతూ.. ఈయూ మార్కెట్‌లో పాకిస్తాన్ ఉన్న "జీరో టారిఫ్ హనీమూన్" ముగిసిందని అన్నారు. దాదాపుగా 1 కోటి ఉద్యోగాలు ప్రమాదంలో ఉన్నాయని హెచ్చరించారు. పరిస్థితిని గమనించిన పాకిస్తాన్ ప్రభుత్వం పరిశ్రమలకు విద్యుత్ ధరల్ని తగ్గించే చర్యల్ని ప్రారంభించింది. పారిశ్రామిక వినియోగదారుల కోసం యూనిట్ రూ. 4.04 మేర విద్యుత్ ధర తగ్గించింది.




**ఒక్కరోజే లక్ష 7,971 తగ్గిన వెండి, రూ.19,750 తగ్గిన బంగారం**

**అంతర్జాతీయ మార్కెట్లో భారీగా పతనమైన బంగారం, వెండి ధరలు..**

**ఒక్కరోజే రూ.19,750 తగ్గిన తులం బంగారం ధర..**

**ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,653..**

**ఒక్కరోజే రూ.1,07,971కి పడిపోయిన కిలో వెండి..**

**ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,91,922..**

గత కొంతకాలంగా సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పెరిగిన బంగారం, వెండి ధరలు రెండు రోజులుగా క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. ఈరోజు ( జనవరి 31న) అంతర్జాతీయ మార్కెట్లో బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా భారీగా పడిపోయాయి. గ్లోబల్ మార్కెట్లలో చోటు చేసుకున్న పరిణామాల ప్రభావంతో బులియన్ మార్కెట్ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటుంది. ఒక్కరోజులోనే తులం బంగారం ధర రూ.19,750 మేర తగ్గి పెట్టుబడిదారులకు షాక్ ఇచ్చింది. కాగా, ప్రస్తుతం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,49,653గా కొనసాగుతోంది. ఒక్కరోజే దాదాపు 10 శాతం మేర బంగారం ధర తగ్గినట్లు మార్కెట్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఇటీవలి రోజులుగా బంగారం ధరలు ఎగబాకిన నేపథ్యంలో ఈ స్థాయి పతనం కావడం మార్కెట్‌లో కలకలం రేపుతుంది. మరోవైపు, వెండి ధరలు కూడా బంగారం బాటలోనే నడుస్తున్నాయి. ఒక్కరోజులోనే కిలో వెండి ధర రూ.1,07,971 మేర తగ్గిపోయింది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,91,922గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో వెండి ధరలు సుమారు 34 శాతం మేర క్షీణించినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. అయితే, అమెరికా డాలర్ బలపడటం, అంతర్జాతీయ మార్కెట్లో వడ్డీ రేట్లపై అంచనాలు మారడంతో.. గ్లోబల్ ఆర్థిక అనిశ్చితి వంటి కారణాలే ఈ ధరల పతనానికి ప్రధాన కారణాలుగా ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. రాబోయే రోజుల్లో బంగారం, వెండి ధరల్లో మరింత ఒడిదుడుకులు కొనసాగే ఛాన్స్ ఉంది.

# నాకు ముందే తెలుసు..






కోలీవుడ్ స్టార్ యాక్టర్ దళపతి విజయ్ టైటిల్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం జన నాయగన్ తెలుగులో ప్రజల నాయకుడు టైటిల్‌తో వస్తోంది. ఈ చిత్రం ముందుగా నిర్ణయించిన ప్రకారం జనవరి 9నే ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కావాల్సి ఉంది. అయితే జననాయగన్‌కు సెన్సార్ బోర్డ్ సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో విజయ్ టీం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. రాజకీయ కారణాలతో జననాయగన్ సినిమాకు ఇబ్బందులు కలిగిస్తున్నారని ఇప్పటికే టీవీకే ఆరోపిస్తోంది. కాగా ఇటీవలే సెన్సార్ బోర్డు సుప్రీంకోర్టు కేవియట్ పిటిషన్ దాఖలు చేసింది. ఒకవేళ నిర్మాతలు ఏదైనా అప్పీలు చేస్తే తమ వాదనలు వినకుండా ఎలాంటి ఆదేశాలు జారీ చేయొద్దని సెన్సార్ బోర్డు అత్యున్నత న్యాయస్థానాన్ని కోరింది. అయితే ఇప్పటివరకు సినిమా చిక్కులకు సంబంధించి ఎలాంటి కామెంట్ చేయలేదు. దీంతో అభిమానులు తీవ్ర నిరాశలో మునిగిపోతున్నాయి. తాజాగా దీనిపై క్లారిటీ ఇచ్చేశాడు విజయ్. ఓ నేషనల్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో నా పొలిటికల్ ఎంట్రీ కారణంగా నా జననాయగన్ మూవీ నిర్మాత ఇబ్బందులు పడుతుండటం బాధగా ఉంది. నా రాజకీయారంగేట్రం వల్ల నా సినిమా ప్రభావితమవుతుందని తెలుసు. దీనిపై నేను ముందే మానసికంగా సిద్ధమయ్యానన్నాడు విజయ్. సుమారు 500 కోట్ల భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్నారు. మరి సెన్సార్ సమస్యలు ఎప్పుడు క్లియరవుతాయి.. సినిమా విడుదల ఎప్పుడు అవుతుందనేది డైలామా నెలకొంది. కార్తీ (ఖాకీ) ఫేం హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తున్నఈ చిత్రం నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన ఫస్ట్ లుక్, ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ మూవీకి అనిరుధ్ సంగీతం అందిస్తుండగా.. కన్నడ టాప్ బ్యానర్ కేవీఎన్ ప్రొడక్షన్ నిర్మిస్తోన్న ఈ మూవీలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ కీ రోల్‌లో కనిపించనున్నారు. మమితా బైజు, గౌతమ్ వాసుదేవ్ మీనన్, ప్రకాష్ రాజ్, నరైన్, ప్రియమణి ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

# దుబాయ్‌లో అల్లు శిరీష్‌నయనిక ప్రీ వెడ్డింగ్ సంబరాలు

ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ చిన్న కుమారుడు, హీరో అల్లు శిరీష్ త్వరలోనే వివాహ బంధంలోకి అడుగు పెట్టబోతున్నాడు. తన ప్రేయసి నయనికను ఈ ఏడాది మార్చిలో పెళ్లి చేసుకోనున్న శిరీష్, పెళ్లికి ముందే దుబాయ్‌లో గ్రాండ్‌గా ప్రీ వెడ్డింగ్ పార్టీ నిర్వహించాడు. కుటుంబ సభ్యులు, సన్నిహిత మిత్రులతో కలిసి జరిగిన ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. మార్చిలో జరిగే వివాహానికి ముందు శిరీష్‌నయనిక జంట దుబాయ్‌లో ఫ్యామిలీ అండ్ ఫ్రెండ్స్ కోసం ప్రత్యేకంగా ఈ పార్టీని ప్లాన్ చేశారు. అల్లు అర్జున్ స్నేహారెడ్డి దంపతులతో పాటు అల్లు కుటుంబం మొత్తం ఈ సంబరాల్లో పాల్గొంది. జే1 బీచ్ ప్రాంతంలో, సముద్రంలో ప్రయాణిస్తున్న బోటులో జరిగిన పార్టీ వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. పార్టీలో శిరీష్ షాంపైన్ బాటిల్ ఓపెన్ చేసి స్ప్రే చేయగా, చుట్టూ ఉన్న అతిథులంతా చప్పట్లతో హోరెత్తించారు. ఆ సమయంలో పక్కనే నిలబడ్డ అల్లు అర్జున్ నవ్వుతూ కనిపించాడు. శిరీష్, నయనిక ఇద్దరూ షాంపైన్‌ను షేర్ చేసుకుంటూ తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఈ వీడియోలు అభిమానులను బాగా ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రీ వెడ్డింగ్ పార్టీకి సంబంధించిన మరో హాట్ టాపిక్‌డ అల్లు అర్జున్ ధరించిన షర్ట్. జే1 బీచ్‌లో తీసిన వీడియోలో స్నేహారెడ్డి వైట్ కలర్ డ్రెస్‌లో స్టైలిష్‌గా కనిపించగా, అల్లు అర్జున్ మాత్రం వెర్సాస్ (ఎవతీయిఖిఎవ) ప్రింటెడ్ సిల్క్ ట్విల్ షర్ట్లో అదిరిపోయాడు. ఆ బ్రాండ్ అధికారిక వెబ్‌సైట్ సమాచారం ప్రకారం, ఈ షర్ట్ ధర రూ. 1,39,600 కావడం విశేషం. దీంతో అల్లు అర్జున్ లుక్ మరోసారి ఫ్యాషన్ ప్రియుల దృష్టిని ఆకర్షించింది. అల్లు శిరీష్ తన తాత, దిగ్గజ నటుడు అల్లు రామలింగయ్య జయంతి సందర్భంగా నయనికను వివాహమాడనున్నట్లు అక్టోబర్ 1, 2025న అధికారికంగా ప్రకటించాడు. ఈ జంట అక్టోబర్ 31, 2025న హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా ఎంగేజ్‌మెంట్ చేసుకుంది. మార్చి 6, 2026న శిరీష్‌నయనిక వివాహం జరగనుండగా, ఇదే రోజు అల్లు అర్జున్ స్నేహారెడ్డి మ్యారేజ్ డే కావడం మరో విశేషం. ఇటీవల ట్రెండింగ్‌లో ఉన్న ఓ రీల్ ద్వారా ఈ పెళ్లి తేదీని శిరీష్ స్వయంగా వెల్లడించాడు. మొత్తానికి, అల్లు కుటుంబంలో మరో పెళ్లి వేడుకకు కౌంట్‌డౌన్ మొదలవ్వగాడ దుబాయ్ ప్రీ వెడ్డింగ్ పార్టీతో సంబరాలకు ఇప్పటికే స్టార్ట్ పడిపోయింది.



# దీపిక స్థానంలో సాయి పల్లవి!

రెబెల్ స్టార్ ప్రభాస్ ఇటీవల ది రాజాసాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చిన విషయం తెలిసిందే. మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ హారర్ ఫాంటసీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో వసూళ్లను రాబట్టలేక పోయింది. దీని తర్వాత ఏమిటనే చర్చ జరుగుతన్న నేపథ్యంలో కల్కి2 వచ్చే నెలలో సెట్స్ మీదకు తీసుకురాబోతున్నారని, ఇందుకోసం ప్రభాస్ ఫిబ్రవరిలో 10 రోజులు కాల్షీట్లు కూడా కేటాయించాడని వార్తలు వస్తున్నాయి. ప్రశాంత్ నీల్ ప్రస్తుతం జూనియర్ ఎన్టీఆర్ డ్రాగన్ మూవీతో బిజీగా ఉన్నందున.. ముందుగా నాగ్ అశ్విన్ తో కల్కి 2898 ఏడీ పార్ట్-2 పూర్తి చెయ్యాలని నిర్ణయించుకున్నాడట. ఇక కల్కి 2లో దీపికా భాగం కాదని మేకర్స్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. దీంతో ఆమె స్థానంలో ఎవరిని తీసుకుంటారనే చర్చ నడిచింది. ఈ క్రమంలో పలువురు హీరోయిన్ల పేర్లు తెర మీదకు వచ్చాయి. ఇందులో భాగంగా సాయి పల్లవి పేరు గట్టిగా వినిపిస్తోంది. పార్ట్-2లో ఆమె కల్కికి జన్మనివ్వబోతోంది. అంటే దాదాపు రెండో భాగం కథంతా ఆ పాత్ర చుట్టూనే తిరుగుతుంది. అలాంటి బలమైన పాత్రను ఇప్పుడు సాయి పల్లవి అయితే మోయగలదని మేకర్స్ భావిస్తున్నారట.



## ఓటీటీ డేట్ లాక్ చేసుకున్న 'మన శంకర వరప్రసాద్ గారు'!?

ఈ సంక్రాంతి కానుకగా థియేటర్స్ లో వచ్చి రీజనల్ ఇండస్ట్రీ హిట్ గా నిలిచిన చిత్రమే "మన శంకర వరప్రసాద్ గారు". మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనీల్ రావిపూడి కాంబినేషన్లో చేసిన ఈ సినిమా భారీ వసూళ్లు కొల్లగొట్టి బాక్సాఫీస్ దగ్గర దుమ్ము లేపింది. ఇలా థియేటర్స్ లో ఇప్పుడు వరకు మంచి రన్ ని కొనసాగిస్తూ వచ్చిన ఈ సినిమా ఫైనల్ గా ఓటీటీ రిలీజ్ డేట్ ని ఫిక్స్ చేసుకున్నట్టు తెలుస్తోంది. ఈ సినిమా హక్కులు జీ 5 సొంతం చేసుకున్న సంగతి అందరికీ తెలిసిందే. ఇక ఇందులో ఈ ఫిబ్రవరి 11 నుంచి అలా పాన్ ఇండియా భాషల్లో ఈ సినిమా అందుబాటులోకి వస్తుంది అని తెలుస్తోంది. సో దీనిపై అధికారిక క్లారిటీ ఇంకా రావాల్సి ఉంది. ఇక ఈ సినిమాకి భీమ్స్ సంగీతం అందించగా నయనతార హీరోయిన్ గా నటించింది. అలాగే వెంకీ మామ సాలిడ్ కామియో చేసి సినిమాకు మరో ప్రధాన ఆకర్షణగా నిలిచారు. అలాగే సుష్మిత కొణిదెల, సాహు గారపాటి నిర్మాణం వహించారు.

